క్లుప్తంగా

విద్యార్థికి చేయూత



నెల్లూరు(బృందావనం): నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు కుమారుడి విద్యకు విశ్వమాత సేవా ఫౌండేషన్ గురువారం చేయూతనందించింది. ఫౌండేషన్ సభ్యుల సహకారంతో విద్యార్థికి నోట్ పుస్తకాల కోసం రూ.3 వేలు అందజేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకురాలు దూబిశెట్టి కళ్యాణి తెలిపారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల పంపిణీ



ముత్తుకూరు : మండలంలోని పాటూరువారికండ్రిక ప్రాథమిక పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు విశ్రాంత హెచ్ఎం, జ్యోతిష్యమణి డాక్టర్ జీవీటీ మురళీకృష్ణ విద్యా సామగ్రి వితరణ చేశారు. గురువారం ఎంఈఓలు హేమసుందర్, మధుసూదన్ చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు. విద్యాబోధన చేసిన పాఠశాలను మరిచిపోకుండా మురళీకృష్ణ విద్యా సామగ్రి వితరణ చేయడం సంతోషకరమని వారు కొనియాడారు. కాగా పూర్వవిద్యార్థి మాచిరెడ్డి భాను విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. హెచ్ఎం రఘురామయ్య, ఉపాధ్యాయిని పద్మావతి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



తోటపల్లిగూడూరు : వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజ తెలిపారు. మండలంలోని మాచర్లవారిపాళెం, ఈదూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు సమగ్ర పోషణ యాజమాన్య పద్ధతులపై వ్యవసాయాధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ శైలజ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపికకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శిరీషారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు విద్యాసాగర్‌రెడ్డి, వైష్ణవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను తెలుసుకోవాలి

వెంకటాచలం : విద్య ప్రాధాన్యతను తెలుసుకుని తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని ఎంఈఓ-2 శ్రీనివాసులురెడ్డి కోరారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని అనికేపల్లి పంచాయతీ పరిధిలోని కాశీనగరంలో గురువారం ఆయన పర్యటించారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రాథమిక దశలోనే పిల్లలను బడి మాన్పిస్తే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు విద్యపై అవగాహన పెంచుకుని తమ పిల్లలను చదివించాలని సూచించారు. ఉన్నత చదువులను అభ్యసించడం ద్వారా కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆయన వెంట స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

కొడవలూరు : బడి ఈడు పిల్లలంతా పాఠశాలలో ఉండేలా కృషి చేద్దామని ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్ సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో 'నేను బడికి పోతా' మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఎంపీడీఓ హాజరై మాట్లాడారు. పిల్లలందరినీ బడిలో చేర్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా మండల కమిటీలతో పాటు గ్రామ కమిటీలను కూడా నియమించినట్లు తెలిపారు. ఎంఈఓ వసంతకుమారి మాట్లాడుతూ మండల స్థాయి కమిటీలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు సభ్యులుగా ఉంటారన్నారు. గ్రామస్థాయి కమిటీలో పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త, సంబంధిత పాఠశాల హెచ్ఎంలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. నేను బడికి పోతా కార్యక్రమం వచ్చే నెల 12వ తేదీ వరకు జరుగుతుందని తెలియజేశారు. మండల, గ్రామ కమిటీలు ప్రత్యేక చొరవ చూపి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వంద శాతం అక్షరాస్యత సాధించాలంటే ప్రతి ఒక్కరం సమైక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ-2 ఎస్.అంకయ్య, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, సీఆర్ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, లీలయ్య, శ్రీహరి బాబు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రమాదకర ప్రయాణం



విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా పది మందికి పైగా విద్యార్థులను ఎక్కించుకుని మితిమీరిన వేగంతో వెళుతున్నారు. డ్రైవర్ సీటుకు ఇరువైపులా కూడా విద్యార్థులను కూర్చొపెట్టుకుని తీసుకెళ్తున్నారు. పుస్తకాల, భోజనం బ్యాగులను వాహనానికి ఇరువైపులా వేలాడదీస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగి భారీ మూల్యం చెల్లించకముందే రవాణా, పోలీసు శాఖల అధికారులు ఆటోలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–నెల్లూరు(క్రైమ్)





నీట్‌పై సమగ్ర విచారణ జరిపించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నెల్లూరు (టౌన్): నీట్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర తెలిపారు. నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో గురువారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌తో పాటు నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుందన్నారు. నెట్‌లో అవకతవకలు జరిగినట్లు భావించి రద్దు చేశారన్నారు. నీట్‌తో పాటు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు విష్ణు, శివ, శంకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆందోళన

నీట్ అవకతవకలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్‌షరీఫ్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వీఆర్సీ సెంటర్‌లో గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌పై అనేక అనుమానాలకు తావిచ్చే విధంగా ఎన్టీఏ పరీక్ష నిర్వహించిందన్నారు. దేశ వ్యాప్తంగా 23.33 లక్షల మంది విద్యార్థులు నీటి పరీక్ష రాయగా, ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు హర్యానాలోనే ఉన్నారన్నారు. ఈ విషయమై ఎన్టీఏను వివరణ కోరగా పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైన కారణంగా 1563 మంది విద్యార్థులకు మార్కులు కలపడంతో వచ్చాయని సమాధానం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్టీఏ విడుదల చేసిన నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాదంపై మంత్రుల దిగ్భ్రాంతి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బర్మాషెల్ గుంటలో గురువారం సంభవించిన భారీ అగ్నిప్రమాదంపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని బర్మాషెల్ గుంటలో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 14 కుటుంబాలు నిరాశ్రయులు కావడం, ఓ దివ్యాంగురాలు మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

• బర్మాషెల్‌గుంటలో జరిగిన భారీ అగ్నిప్రమాదంపై నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో 14 కుటుంబాలు నిరాశ్రయులు కావడం, దివ్యాంగురాలు మృతి చెందడం తనను కలిచివేసిందన్నారు. బాధిత కుటుంబాలను మంత్రి నారాయణతో కలిసి అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు.

దివ్యాంగురాలి సజీవ దహనం హృదయ విదారకం



నెల్లూరు(దర్గామిట్ట): బర్మాషెల్‌గుంట ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో దివ్యాంగురాలు సజీవ దహనం కావడం హృదయవిదారకమని నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. అగ్నిప్రమాద సమయంలో సత్వరం స్పందించిన అధికారులు, కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నా ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దు



నెల్లూరు సిటీ: వ్యాపార సంస్థల ఎదుట తన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయొద్దని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద ఉన్న తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను రూరల్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ కుదరదని, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్నారు. ఇటీవల వెవీ రామిరెడ్డి వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి తనను క్షమాపణ కోరారన్నారు. దానికి తాను స్పందించదలుచుకోలేదన్నారు. తనకు చాలా అవమానాలు జరిగాయని, వాటిని పట్టించుకోకుండా ముందుకెళ్తున్నానని తెలిపారు.

నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులను వితరణ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని అర్చకులు, పురోహితులకు గురువారం నిత్యావసర సరుకులను వితరణ చేశారు. ఇస్కాన్‌సిటీలోని హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఉదయగిరి వేంకట శేషాచార్యులు, ధర్మసింధు ఆధ్యాత్మిక సేవా సమితి అధ్యక్షుడు ధన్వి శ్రీనివాస్, సింహపురి ధార్మిక సేవా సంస్థ అధ్యక్షుడు ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, సీతారామ ధార్మిక సేవా సంస్థ ప్రతినిధి అనంతబాబు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రామిరెడ్డి రామచంద్రారెడ్డి, కమలమ్మ, వసంతకుమార్ రెడ్డి కుటుంబసభ్యుల సౌజన్యంతో 40 కుటుంబాలకు రూ.1.50 లక్షల విలువైన నిత్యావసరాలను వితరణ చేయడం హర్షణీయమన్నారు. హైందవ ధర్మ సంరక్షణలో ప్రధాన భూమిక పోషించే అర్చక, పురోహితులకు తోడ్పాటును అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘాల నేతలు ముట్వా ప్రసాద్‌శర్మ, నేలనూతల భాస్కరమూర్తి, రామాయణం మణిశంకరశర్మ, వాకాటి కల్యాణకృష్ణ, బాలసుప్రియ, బీ కుమారదివాకర్, ఈదూరు శ్రీహరి శేషసాయి, శ్రీకృష్ణప్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నెల్లూరు సిటీ: రైతులు పంటల సాగుకు ముందుగా భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ నెల్లూరు ఏడీ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాల్లోని రైతులకు వ్యవసాయశాఖ అధికారులు భూసార పరీక్షలపై గురువారం అవగాహన కల్పించారు. అనంతరం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షలతో భూమిలోని నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి పోషకాల లభ్యతను తెలుసుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులను విచ్చల విడిగా వినియోగిస్తే భూములు దెబ్బతినడంతో పాటు తెగుళ్ల ఉధృతి ఎక్కువై దిగుబడులు తగ్గిపోతాయని తెలిపారు. మరోవైపు ఎరువుల పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులను వినియోగించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదన్నారు. ఈ సమావేశంలో ఏఓ నాగమోహన్, వీఏఏ సుబ్రహ్మణ్యం, గ్రామ ఉద్యాన సహాయకులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు నగదు బహుమతులు



బహుమతులు పొందిన క్రీడాకారులతో వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి

వెంకటాచలం : వీఎస్‌యూ అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు వీఎస్‌యూ వైస్‌చాన్సలర్ జీఎం సుందరవల్లి గురువారం నగదు బహుమతులు అందజేశారు. వీఎస్‌యూ అంతర్ కళాశాలల టోర్నమెంట్‌లో పురుషుల చాంపియన్ షిప్‌లో జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన మహేష్‌బాబు, మహిళలకు సంబంధించి డీకే మహిళా కళాశాలకు చెందిన సుప్రియ రాణించి రూ.5వేలు చొప్పున నగదు బహుమతులు సాధించారు. ఇన్‌స్టిట్యూషన్ చాంపియన్‌షిప్‌లో మహిళలకు సంబంధించి డీకే మహిళా కళాశాల, పురుషులకు సంబంధించి కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాల రూ.25వేల చొప్పున నగదు బహుమతులు సాధించాయి. ఆలిండియా గ్రాప్లింగ్ స్పోర్ట్స్‌లో రజత పతకం సాధించిన కృష్ణచైతన్య కళాశాలకు చెందిన ఎం నరేంద్రకు రూ.15వేలు అందజేశారు. వీఎస్‌యూ అనుబంధ కళాశాలలకు చెందిన 40 మంది క్రీడాకారులకు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ రూ.3 వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.సునీత, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



స్నేహానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్టిఫికెట్ల ప్రదానం



అల్లీపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. కొండాయపాళెం సెక్టార్ పరిధిలోని బీవీనగర్ ప్రాంతంలో ఉన్న స్నేహానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సంబరాల్లో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్లు నిండిన పిల్లలకు ఆటపాటలతో ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పిస్తున్నామని వివరించారు. అందులో భాగంగా గ్రాడ్యుయేషన్ డే సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రీస్కూల్ పూర్తి చేసుకున్న చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ, సూపర్‌వైజర్ సుకన్య, అంగన్‌వాడీలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

అల్లీపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో..

నెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నవాబుపేట సెక్టార్‌లో ఉన్న అల్లీపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలను చేర్పించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లులకు దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, కార్యకర్తలు రత్నమ్మ, అనురాధ, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



యోగా దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జీవన యోగాశాల రూపొందించిన వాల్‌పోస్టర్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. అనంతరం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన కోవూరు యోగా క్రీడాకారుడు సాధన్‌ను అభినందించారు. నెల్లూరులోని వేమిరెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ప్రసన్నకుమార్, కార్యదర్శి స్వప్న, కోశాధికారి సరోజ, సభ్యులు శ్యామ్‌సింగ్, రవీంద్ర, అరుణ, కోట సత్యం, నాగభవాని తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలి

• రాష్ట్ర టీబీ నివారణాధికారి డాక్టర్ రమేష్



బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మనుబోలు : అర్హులైన వారందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని రాష్ట్ర క్షయ నివారణాధికారి డాక్టర్ రమేష్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌పై వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం మనుబోలు, చెర్లోపల్లి, మడమనూరు సచివాలయాల పరిధిలోని విలేజ్ వెల్‌నెస్ సెంటర్లను పరిశీలించారు. వ్యాక్సినేషన్ తీరుతెన్నులపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఇప్పటి వరకు మండలంలో 2,902 మందికి మాత్రమే బీసీజీ వ్యాక్సిన్ వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. కోవిడ్ టీకాలు వికటించాయన్న ప్రచారం వల్ల బీసీజీ వ్యాక్సిన్ వేయించుకునేందుకు చాలా మంది భయపడుతున్నారని వైద్య సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ మాట్లాడుతూ బీసీజీ వ్యాక్సిన్ వల్ల ఎటువంటి దుష్ఫలితాలు ఉండవని వివరించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, 18 ఏళ్లు నిండి ఐదేళ్లుగా క్షయతో బాధపడుతున్న వారు, బీఎంఐ 18 కేజీల కన్నా తక్కువ ఉన్న వారు, షుగర్ రోగులు, పొగ తాగే అలవాటు ఉన్న వారు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. 18 ఏళ్లలోపు వారు, హెచ్ఐవీ ఉన్న వారు, గర్భిణులు, హృదయ సంబంధ వ్యాధులున్న వారు, డయాలసిస్, కేన్సర్ పేషెంట్లు, క్షయ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న వారు, క్రానిక్ డిసీజెస్ ఉన్న వారు, మూడు నెలల్లోపు రక్తదానం చేసిన వారు ఈ వ్యాక్సిన్ వేయించుకునేందుకు అనర్హులని తెలిపారు. వ్యాక్సిన్‌పై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, టీబీ కోఆర్డినేటర్లు విజయ్, శ్రావణ్, టీబీ సూపర్‌వైజర్ జావెద్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మొహిసినా సుల్తానా, గేయపూజిత, సూపర్‌వైజర్ రమణయ్య, నాగయ్య, రాజన్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



కోవూరు : యోగాపై అవగాహన ర్యాలీ



కొడవలూరు : గండవరంలో...

• ఆయుర్వేద వైద్యాధికారి గీత

కొడవలూరు : యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం సాగించవచ్చని గండవరం ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారిణి ఎస్ గీత తెలిపారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గండవరంలో హైస్కూల్ విద్యార్థులతో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా అనేక రకాల మానసిక, ఆరోగ్యకర సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. ఆరోగ్యకర జీవనానికి యోగా ఎంతో తోడ్పతున్నందునే ప్రపంచ వ్యాప్తంగా దానికి ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకుడి ద్వారా ప్రతిరోజూ యోగా నేర్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు, యోగా శిక్షకులు జ్యోతి రాజేంద్రకుమార్, హిమబిందు, సుజాత, మాల్యాద్రి, ఉపాధ్యాయులు జి.నాగభూషణం, పి.శ్రీనివాసులు, సీహెచ్.శివనాగబాబు, పుట్టయ్య, మల్లికార్జున, కట్టా సురేష్, ఎం.పవన్‌కుమార్, ఖాజా హుస్సేన్, కుసుమ పాల్గొన్నారు.

యోగా ఆవశ్యకత తెలుసుకోవాలి

కోవూరు : మండల కేంద్రమైన కోవూరులో యోగాపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సత్యాన్వేషణ చైతన్య ధ్యాన యోగా కేంద్రం గురువు గోళ్ల జనార్దన్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించి యోగా ఆవశ్యకతను వివరించారు. టీఎంసీ కళాశాల ప్రాంగణంలో ప్రతిరోజూ ఉచితంగా నిర్వహిస్తున్న యోగా తరగతుల్లో ప్రతిఒక్కరూ పాల్గొని ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, ప్రసూన, సలీం, రమణయ్య, సురేష్, రంగారెడ్డి, రాఘవయ్య, జిలాని పాల్గొన్నారు.

23న టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సంఘ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ సంఘ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ తప్పక హాజరుకావాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని బర్మాషెల్‌గుంటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దివ్యాంగ మహిళ సజీవ దహనం కావడం దురదృష్టకరమన్నారు. దివ్యాంగురాలి కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారం అందించాలని కోరారు. మిగిలిన కుటుంబాలకు నష్టపరిహారంతో పాటు గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.